క్లుప్తంగా

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



స్వామివారిని తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీముఖలింగంలో మార్గశిర మాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా బుధవారం రాత్రి స్వామివారికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. పార్వతీ పరమేశ్వరులను అలంకరించారు. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ



ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

హిరమండలం: స్థానిక ప్రేమసాయి వృద్ధాశ్రమంలో అభయాంజనేయస్వామి విగ్రహావిష్కరణ బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. కొద్దిరోజుల కిందట దాతల సహకారంతో ఇక్కడ అభయాంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. హనుమాన్ చాలీషా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేశారు. ఆశ్రమ గౌరవ అధ్యక్షుడు ఏవీ సురేష్, అబ్బాయి, కోఆర్డినేటర్ సాయిబాబా, చంటి మాస్టారు, లంక రామారావు, అప్పలనాయుడు, వెంకటరమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు: మండలంలోని అందవరం గ్రామం వద్ద రూ.84 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న వంతెన పనులకు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే సుమారు 25 గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. తహసీల్దార్ జెన్ని రామారావు, ఆర్అండ్‌బీ జేఈఈ సరోజాదేవి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్



పాతపట్నం: పాస్టర్లతో కలిసి కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో పాస్టర్స్ ఆధ్వర్యంలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హాజరై కేక్ కట్ చేశారు. పాస్టర్ సుందర్ సింగ్ మాట్లాడుతూ క్రీస్తు జన్మం గురించి వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్టేట్ క్రిస్టియన్ సెల్ జనరల్ సెక్రటరీ బోసుబాబు, కృపానందం, డానియేల్ రాజు, బర్నబాస్, రామారావు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



మెళియాపుట్టి: దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెళియాపుట్టి: తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మామిడి శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలు మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద బుధవారం నిర్వహించారు. మండలంలోని పార్టీ నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కత్తిరించారు. అనంతరం పలువురు వృద్ధులు, పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సీనియర్ నాయకులు పాడి అప్పారావు, సర్పంచ్‌లు గణపతి ప్రదాన్, ఉర్లాన రవి, నాయకులు ఉర్లాన రుషి, కిరణ్, కన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: పాతపట్నం మండల కేంద్రంలో తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శ్రీకాంత్ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం సీహెచ్‌సీ ఆస్పత్రిలో ఉన్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఔషధం

- చలికాలంలో గొర్రెలు, మేకలకు పలు రకాల వ్యాధులు ప్రబలే అవకాశం
- ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

పాతపట్నం: చలికాలం కావడంతో గొర్రెలు, మేకల పెంపకందారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, లేకపోతే జీవాలు వివిధ వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పారుడు, అర్స్, మసూచీ, చిటుక తదితర వ్యాధులు ప్రబలుతాయి. ఈ వ్యాధులున్న జీవాల నుంచి వ్యాధికారక సూక్ష్మ జీవులు మందలో ఉన్న గొర్రెలు, మేకలకు కూడా వ్యాప్తించే అవకాశం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

- చలి కాలంలో దోమలు, కీటకాల వల్ల గొర్రెలు, మేకలకు తిక్క(సర్ప) రోగం ఎక్కువగా వస్తుంది.
- త్వరగా గుర్తించకపోతే అవి మృతి చెందే అవకాశం ఉంటుంది.
- ముందస్తు చర్యల్లో భాగంగా సాయంత్రం పాకలు, మందల వద్ద వేపాకు దూపం, రాత్రి పూట మంట పెట్టాలి.
- కీటకాలు మంటకు ఆకర్షితమైనందున వాటి ప్రభావం జీవాలపై పడదు.
- గొర్రెలు, మేకలను చలి బారి నుంచి రక్షించుకునేందుకు పాకలు ఏర్పాటు చేసి, వాటికి న్యుమోనియో (ఉమ్మి) వ్యాధి సోకకుండా కాపాడుకోవాలి.
- ఉమ్మి వ్యాధి సోకిన వాటిని గుర్తించి మంద నుంచి వేరుచేయాలి.
- ప్రత్యేక ప్రదేశంలో ఉంచి చికిత్స చేయించాలి.
- వాటికి సులవుగా జీర్ణమయ్యే ఆహారం, శుభ్రమైన తాగునీరు ఇవ్వాలి.
- పూర్తిగా వ్యాధి నుంచి కోలుకున్న తరువాత మాత్రమే మందలో కలపాలి.
- వ్యాధులు సోకిన గొర్రె, మేకలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లకూడదు.
- గొర్రె, మేక మృతి చెందితే వాటి కళేబరాలను ఊరికి దూరంగా తీసుకువెళ్లి లోతుగా గోతి తీసి సున్నం వేసి పూడ్చి పెట్టాలి.
- గొర్రెలు, మేకలు మృతి చెందిన ప్రదేశాన్ని క్రిమిసంహారక ద్రావణాలతో శుభ్రపరచాలి.
- మృతి చెందిన గొర్రెలు, మేకలు తిన్న గడ్డి, ఆహారాన్ని కాల్చివేయాలి.
- నీటి పాత్రలను క్రిమి సంహారక ద్రావణంలో కడిగి ఎండలో ఆరబెట్టాలి.



కొరసవాడలో మేతకు వెళుతున్న మేకలు, గొర్రెలు

పాతపట్నం నియోజకవర్గంలోని మేకలు, గొర్రెల వివరాలు

మండలం	గొర్రెలు	మేకలు
పాతపట్నం	9,794	8,916
మెళియాపుట్టి	10,369	14,977
కొత్తూరు	18,913	5,823
హిరమండలం	5,477	4,252
ఎల్.ఎన్.పేట	6,876	7,548

వ్యాధి లక్షణాలు ఇలా..

శర్మంపై కణతలు రావడం చిన్న పరిమాణంలో మొదలై శరీరం అంతా వ్యాపిస్తాయి. చర్మం చిట్లిపోయి రక్తం కారుతుంది. ఈ వ్యాధి నివారణకు నిర్దిష్టమైన వ్యాక్సిన్ అందుబాటులో లేదు. యాంటీ బయాటిక్స్ మందులు ఐదు రోజులు నుంచి ఏడు రోజుల వరకు వాడడం వలన తగ్గే అవకాశం ఉంది. ఇలా జాగ్రత్తలు పాటిస్తే గొర్రెలు, మేకలను సులువుగా కాపాడుకోవచ్చని పశువైద్యాధికారులు చెబుతున్నారు.



కొమనపల్లిలో మేకలకు పి.పి.ఆర్ టీకాలు వేస్తున్న దృశ్యం (ఫైల్)

వైద్యాధికారులను సంప్రదించాలి



చలి కాలంలో సాధారణంగా గొర్రెలు, మేకలకు వివిధ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. మూగ జీవాలు నీరసంగా ఉన్నట్లు గ్రహిస్తే.. పెంపకందారులు వెంటనే పశువైద్యులకు చూపించాలి. తగిన నివారణ చర్యలు సూచిస్తాం. ఆహారం తినకపోయినా ఫోన్ చేస్తే వెంటనే ప్రథమ చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– డాక్టర్ మంచు కరుణాకరరావు, సహాయ సంచాలకులు, ప్రాంతీయ పశువైద్యశాల, పాతపట్నం

ఔదార్యం..



కొత్తూరు మండలంలోని అఫీయల్ కాలనీకి చెందిన బుడుమూరి కుమార్ కాలును కొంత భాగం శస్త్ర చికిత్స ద్వారా ఇటీవల తొలగించారు. వైద్య ఖర్చుల నిమిత్తం కుమార్ కుటుంబ సభ్యులకు భగత్ సింగ్ ట్రస్టుకు చెందిన నిధుల నుంచి రూ.20 వేల ఆర్థిక సహాయం చేశారు. చెక్‌ను కల్లెమ్మ సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌నాయుడు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

– కొత్తూరు

ఆకట్టుకున్న కోలాటం



సారవకోట మండలం అడ్డపనస గ్రామంలోని బీవీకే పాఠశాల విద్యార్థులు గీతా జయంతి పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. సారవకోట, అలుదు గ్రామాల్లోని కోలాట ప్రదర్శన చేపట్టారు. ఎంఈఓ ఎం.వి.రమణ హాజరై హిందూ ధర్మం, ఆచార, సంప్రదాయాలను గూర్చి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

– సారవకోట

అందినంత ఎత్తులో..



కొత్తూరు మండలం కలిగాం కూడలిలోని వైఎస్సార్ జగనన్న కాలనీకి అనుకొని ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చేతికి అందినంత ఎత్తులో ఉంది. చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయలేదు. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచడంతోపాటు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

– కొత్తూరు

అధ్వానం



సరుబుజ్జిలి మండలంలోని అలికాం– బత్తిలి రహదారి నుంచి చినషళంత్రి గ్రామం వరకు సుమారు కిలో మీటరున్నర పంచాయతీరాజ్ రహదారి అధ్వానంగా ఉంది. రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏమాత్రం వర్షం వచ్చినా రహదారి గుంతల్లో నీరు చేరి వాహనాలు బురదలో దిగబడిపోతున్నాయి. అధికారులు స్పందించి రహదారి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

రైతుల పక్షాన పోరాడుదాం



రైతు ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, నాయకులు

- కూటమి ప్రభుత్వ మోసాలను ఎలుగెత్తి చాటుదాం..
- 13న రైతు సమస్యల ర్యాలీని విజయవంతం చేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపు

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులు అన్నింటా మోసాలకు గురవుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఈ ఐదు నెలల్లో రైతులకు చేసిన మేలు ఏమీలేదన్నారు. తిరిగి అనేక రకాల ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. మరోపక్క గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను రద్దు చేసిందన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, వారి తరఫున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి మేలు జరిగేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ నెల 13న జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. శాంతియుతంగా చేపట్టనున్న ఈ ర్యాలీకి ఇతర పక్షాలు కూడా మద్దతు తెలపాలని కోరారు. గత ప్రభుత్వ కాలంలో రైతు భరోసా పేరున రైతులకు పెట్టుబడి సహాయం ఐదేళ్లు అందించామన్నారు. బీమా భారం రైతులపై పడకుండా ప్రభుత్వమే చెల్లించిందన్నారు. ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి రైతులను కష్టాలు, నష్టాల్లో ఆదుకున్నామన్నారు. సున్నా వడ్డీ పథకం అమలు చేశామని, కౌలు రైతులకు ఉదారంగా లోన్లు ఇప్పించామన్నారు. ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు సకాలంలో రైతు చెంతకు సరఫరా చేశామన్నారు. ఈ సందర్భంగా ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జలుమూరు ఎంపీపీ వాన గోపి వైఎస్సార్ సీపీ నాయకులు ముద్దాడ బైరాగినాయుడు, కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, నక్క తులసీదాస్, దోమ మన్మథరావు, సురంగి నర్సింగరావు, కనపల శేఖర్, యాబాజీ రమేష్, ధర్మాన జగన్, బొబ్బాది ఈశ్వరరావు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ

- ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

ఆమదాలవలస: అన్నదాతకు వైఎస్సార్‌సీపీ తరఫున అండగా నిలుస్తామని ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణంలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 13న జిల్లా కలెక్టరేట్ వద్ద రైతులతో ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేస్తామన్నారు. తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, దళారీ వ్యవస్థను తొలగించాలని, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలన్నారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి రైతులపై అదనపు భారాన్ని మోపే చర్యలను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మాజీ కౌన్సిలర్లు దుంపల చిరంజీవి, మామిడి రమేష్, పాడుగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందజేసేది ఎప్పుడు?

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



రైతు ఆందోళన పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తరువాత రైతులను అన్ని విధాలా మోసం చేసిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. పాతపట్నంలోని తన క్యాంప్ కార్యాలయం వద్ద బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు రైతులకు మద్దతుగా ఈ నెల 13వ తేదీన ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి అందులో పొందుపర్చిన అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, పార్టీ నాయకులు కలమట రమేష్, కె.జానకమ్మ, పెనుమజ్జి విష్ణుమూర్తి, బి.నారాయణమూర్తి, ఎవి సురేష్, బూర్లె శ్రీనివాసరావు, బైపోతు ఉదయ్, చింతాడ సూర్యనారాయణ, వంగపల్లి చిన్నారావు, లోలుగు లక్ష్మణరావు, బెవర గంగాధర్, ప్రవీణ్, ఎం.తాతయ్య, వెలమల బాలరాజు, జోగారావు, ఈగల చిన్నారావు, పనుకు మోహన్‌రావు, నాన బాలకృష్ణ, ఎం.గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ

ఎల్.ఎన్.పేట: మండలంలో ఈ నెల 14వ తేదీన జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ బుధవారం పరిశీలించారు. పెద్దకోట, పెద్దకొల్లివలస, కృష్ణాపురం గ్రామాల్లో పర్యటించారు. మండలంలో మూడు మేజర్, నాలుగు మైనర్ సాగు నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. మరో రెండు సంఘాలకు సంబంధించిన ఓటర్లు సరుబుజ్జిలి మండలంలోని తెలికిపెంట, సరుబుజ్జిలి సంఘాల్లో నమోదై ఉన్నారని వారంతా సరుబుజ్జిలి మండలంలోని ఎన్నికల్లో పాల్గొంటారన్నారు. రైతులు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వంశధార జేఈ టి.శ్రీనివాసరావు, వీఆర్వోలు రమణమ్మ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ

కొత్తూరు: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-2ను ఈ నెల 10వ తేదీన ఉదయం 11.30 గంటలు వరకు తెరవలేదని అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు టెక్కలి డీఎల్‌డీఓ అలివేలు మంగమ్మ బుధవారం గ్రామ సచివాలయం-2ను తనిఖీ చేశారు. గ్రామ సచివాయం తెరవకపోడానికి గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పలు రకాల సర్వేలకు వెళ్లినట్లు సిబ్బంది వివరణ ఇచ్చారు. సిబ్బంది చెప్పిన వివరాలను డీఎల్‌డీఓ నమోదు చేశారు. కార్యదర్శి మాత్రం హాజరుకాలేదని ఈఓపీఆర్డీ వసంతకుమారి చెప్పారు. కార్యదర్శి ఎటువంటి సెలువు పెట్టలేదన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాతపట్నం: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 13వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టెక్కలి ఈఈ జి.శంకరరావు బుధవారం తెలిపారు. ఎన్‌హెచ్ 326 రోడ్డు పనులు, 132/33 కేవీ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు పాతపట్నం, బూరగాం, కాగువాడ, కొరసవాడ, బోరుబద్ర, గురండి, బగదల, కాపు గోపాలపురం, సీతారాంపల్లి, చంగుడి, సరాలి, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, దాసుపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: పట్టణంలో ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న 33/11 కె.వి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, చెట్లకొమ్మలు తొలగించడం వంటి పనులు చేపడతామన్నారు. కనుగులవలస, వెంగళరావు కాలనీ, ఎంపీడీఓ కార్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, ఇండస్ట్రియల్ ఏరియా, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

కేవీజీకి సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

సరుబుజ్జిలి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కిల్లి వెంకటగోపాల సత్యనారాయణకి(కేవీజీ) స్వగ్రామం పురుషోత్తపురంలో ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు ఆధ్వర్యంలో బుధవారం పలువురు నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. పార్టీని మరింత అభివృద్ధి బాటలో నడిపించి, ప్రజా సమస్యలపై మరింత ఉత్సాహంగా పనిచేయాలని కేవీజీని నాయకులు, కార్యకర్తలు కోరారు. రానున్న కాలంలో అందరం కలిసికట్టుగా పనిచేస్తే మంచి ఫలితాలు ఉంటాయని కేవీజీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గీతాపారాయణం



కొత్తూరు: మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



ఆమదాలవలస: గీతాయజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో గీతా జయంతి పురస్కరించుకుని బుధవారం గీతాపారాయణం చేపట్టారు. అర్చకులు సిద్ధయ్య స్వామి ఆధ్వర్యంలో పలువురు భగవద్గీతలోని 18 అధ్యాయాలను పారాయణం చేశారు.

ఆమదాలవలసలో

ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో గీతా జయంతి సందర్భంగా వేదపండితుడు, భగవద్గీత ప్రచార సమితి అధ్యక్షుడు అంపోలు రామచార్యులు ఆధ్వర్యంలో 21 మంది రుత్వికులు గీతాయజ్ఞం నిర్వహించారు. భగవద్గీత చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, విద్యాసాగర్, వికాష్ తరంగిణి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: ప్రతి ఇంటిలోనూ భగవద్గీతను పఠించాలని టీటీడీ అధ్యాత్మిక మండలి మండల కమిటీ కన్వీనర్ పాగిరి రవి, హెచ్ఎం ముగిది రాంబాబు, పెద్దిన కులశేఖరం అన్నారు. గీతాజయంతి సందర్భంగా కొత్తూరులో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమ నిర్వాహకులు గోగుల బాలచంద్ర బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతపట్నంలో..



పాతపట్నం: వేణుగోపాలస్వామి విగ్రహానికి పూలమాలవేస్తున్న ఏడీలు, తదితరులు

పాతపట్నం: విద్యార్థి దశ నుంచే భగవద్గీత పఠించేలా పెద్దలు చర్యలు తీసుకోవాలని కోటబొమ్మాళి, పాతపట్నం పశు సంవర్ధకశాఖ ఏడీలు ఎం.లోకనాథం, ఎం.కరుణాకరరావు అన్నారు. గీతా జయంతి సందర్భంగా పాతపట్నం కోర్టు కూడలిలో ఉన్న పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయం ఆవరణలో గల వేణుగోపాలస్వామి విగ్రహానికి ఏడీలు పూజలు చేశారు. పి.రామరాజు, పశువైద్యులు అనిల్‌కుమార్, విజయ్‌కుమార్, తారకేసు, కుమారి, మోహన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.